జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 13-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 394 పేజీలు: 4 వెల : రూ.7




# కూటమి ప్రభుత్వం కాదు..
# టీడీపీ ప్రభుత్వమే!

**శ్రీకాకుళం, జూలై 12 (వార్త):** శ్రీకాకుళం పెద్దపాడులోని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నివాసంలో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ధర్మాన సమావేశానికి హాజరుకావడంతో కేడర్‌తో మరింత ఉత్సాహం నెలకొంది. సమావేశం ఆద్యంతం ధర్మాన.. ధర్మాన అంటూ కేడర్ నినాదాలు చేశారు. సమావేశంలో ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ పవన్ అమాయకుడు... పాపాల భైరవుడు బాబే.. అన్నారు. పేరుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అంటున్నారు కానీ అందులో పెత్తనం అంతా చేసేది ఒక్క టీడీపీయే అని అన్నారు. కూటమి అని పేరు చెబుతూ తన పాపాలను అందరికీ అంటించే ప్రయత్నాని బాబు చేస్తున్నారని అన్నారు. నిజానికి చూస్తే కూటమి ప్రభుత్వం కాదిది, చంద్రబాబు ప్రభుత్వమే అని ధర్మాన హాట్ కామెంట్స్ చేశారు. పాపాలన్నీ చేస్తున్నది చంద్రబాబే అని విమర్శించారు. మోసాలు చేయడమే బాబు నైజం అన్నారు. అయినా సరే ఆయనను నమ్మి అధికారం ఇస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆయన అన్ని వర్గాలను ఇపుడు మోసం చేస్తున్నారు అని ధర్మాన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు ఇచ్చే హామీలతో తమకు సంబంధం లేదని బీజేపీ మొదటే తప్పుకుందని గుర్తు చేశారు. ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి సైతం ఏ విషయంలోనూ ఇన్‌వాల్వ్‌మెంట్ లేదని అన్నారు. ఆయన అమాయకుడని ధర్మాన వ్యాఖ్యానించారు. తన రాజకీయం మీద అభద్రతాభావంతోనే పవన్ కళ్యాణ్ చంద్రబాబుని పొగుడుతున్నారే తప్ప మరేమీ కాదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంగానే దీనిని అందుకే చూడాలని ఆయన కార్యకర్తలకు హితబోధ చేశారు. మరో వైపు చూస్తే అత్యంత వెనకబడిన బీద జిల్లా అయిన శ్రీకాకుళానికి ఏడాది పాలనలో బాబు వేయి కోట్ల రూపాయలు కూడా కేటాయించలేదని ధర్మాన మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి కార్యకర్తలే తీసుకెళ్లాలని, సోషల్ మీడియాను ఓ ఆయుధంలా వాడుకోవాలని సూచించారు. తాను ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయబోనని, ప్రభుత్వ విధానాలపై మాత్రమే మాట్లాడతానని ధర్మాన అన్నారు. పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్‌కైనా, అసెంబ్లీకైనా పోటీచేస్తానని తెలిపారు. తన బదులుగా మరొకరికి నాయకత్వం ఇస్తే వారికి మద్దతుగా ప్రోత్సహిస్తానన్నారు. తాను పార్టీ మారతానని ఒకే ఏడాదిలో ఎన్నో పుకార్లు వచ్చాయన్నారు. కానీ అవన్నీ నిజం కావన్నారు. తన సైన్యాన్ని వదిలి వాళ్లతో మాట్లాడకుండా రాజకీయ రంగంలో యుద్ధం ఎలా చేయగలనన్నారు. సభాధ్యక్షుడు చిట్టి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ కళింగ వైశ్య, తూర్పు కాపు కుల విభాగాల రాష్ట్ర అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

* పేరుకే పవన్ జపం.. పెత్తనమంతా చంద్రబాబుదే
* నన్ను నాలుగు పార్టీల్లో కొందరు చేర్పించేశారు
* నేను పార్టీ మారితే నావెంటే జిల్లా అంతా
* నాకు ఆ ఉద్దేశం లేదు * పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్‌కైనా, అసెంబ్లీకైనా పోటీచేస్తా
* చంద్రబాబు మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
* సోషల్ మీడియాను వాడుకోండి * ఏడాది పాలనలో జిల్లాకు వెయ్యి కోట్లు తేలేకపోయారు
* మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
* వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

# శ్రీకాకుళం నుంచి తిరుపతి, సికింద్రాబాద్‌కు..
# నేరుగా రైళ్లు నడపండి

**శ్రీకాకుళం, జూలై 12 (వార్త):** నిత్యం ప్రజల రద్దీ దృష్ట్యా శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు నడపాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం లలిత్ బోహ్రాకు సూచించారు. శనివారం విశాఖపట్నంలో వాల్తేర్ డివిజన్ అధికారులతో కలిసి ఉత్తరాంధ్ర రైల్వే మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ గతిశక్తి పథకం కింద జాతీయ రహదారి 16కు అనుసంధానంగా ఉన్న హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ దగ్గర సరుకు రవాణాకు ఉపయోగపడేలాగా లాజిస్టికల్ పార్క్ అభివృద్ధి చేయాలని తెలిపారు. పాతపట్నం రైల్వేస్టేషన్‌లో రాజా రాణి ఎక్స్‌ప్రెస్‌కు, పొందూరు, శ్రీకాకుళం నుండి పూండి వరకు స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు స్టాప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లా మీదుగా పూరీ-తిరుపతి, భువనేశ్వర్-విజయవాడ వందేభారత్ స్లీపర్ రైలుకు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే మంజూరైన 18 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు కోరారు. శ్రీకాకుళం, నౌపడ స్టేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనుల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. అమృత్ భారత్ పథకం కింద జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రైల్వే మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా కోచ్ సూచిక బోర్డులు, లిఫ్ట్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫామ్ ఎత్తును పెంచడం, తాగునీటి సదుపాయాలు, టాయిలెట్స్ వంటి కీలక మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. సమీక్షలో వాల్తేర్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.






* పెండింగ్ రైల్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి * కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు * ఉత్తరాంధ్ర రైల్వే మౌలిక వసతులపై వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎంతో సమీక్ష

## పోలీసు వలయంలో
# ఫరీద్‌పేట

* బందోబస్తు నడుమ గోపి అంత్యక్రియలు
* కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నేతలు
* 12 మందిపై కేసు నమోదు చేశామన్న ఎస్ఐ

**శ్రీకాకుళం క్రైం, జూలై 12 (వార్త):** ఫరీద్‌పేట గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు. సుమారు 300 మంది పోలీసులు గ్రామంలో మోహరించారు. ఫరీద్‌పేట ముఖ్య కూడలితో పాటు, నవ భారత్ ఫ్లైఓవర్, కొయ్యరాళ్ల కూడలి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసుల బందోబస్తు మధ్య గోపికి అంత్యక్రియలు నిర్వహించారు. సత్తారు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు 12మందిపై జేఆర్ పురం సీఐ ఎం.అవతారం కేసు నమోదు చేశారని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితర వైసీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గోపి కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ నిర్లక్ష్యం వల్లే గోపి హత్య జరిగిందన్నారు. భార్యభర్తల గొడవలకు సంబంధించి 41 నోటీసులు ఇవ్వడానికి 20 మంది పోలీసులతో ఎస్ఐ.. గోపి ఇంటికి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి విషయాలను పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ తక్షణం ఎస్పీ సమగ్ర దర్యాప్తు నిర్వహించి హంతకులకు శిక్ష పడేలా చూడాలన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కొత్తకోట పీఏసీఎస్ డైరెక్టర్‌గా మురళీ ప్రమాణస్వీకారం



**సరుబుజ్జిలి, జూలై 12 (వార్త):** సరుబుజ్జిలి మండల జనసేన అధ్యక్షులు పైడి మురళి మోహన్‌కు చిన్న వయస్సులోనే అరుదైన గౌరవం లభించింది. కొత్తకోట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్ గా మురళి మోహన్ నియమితులయ్యారు. కష్టపడి పనిచేసేవారికి కూటమి ప్రభుత్వంలో గుర్తింపు లభిస్తుందనడానికి పైడి మురళి మోహన్ నిదర్శనమని ఆ పార్టీ నేతలు అన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఆయన ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు కృషి చేస్తానని మురళీమోహన్ తెలిపారు. ఈ పదవి మరింత బాధ్యత పెంచుతుందని, రైతుల అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. జనసేన కార్యకర్త బగ్గు రాజ ధనంజి, తదితరులు మురళీమోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్థికభారం ఉన్నా.. హామీలు అమలు చేస్తున్నాం

- ఈనెలలోనే అన్నదాత సుఖీభవ నిధులు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**సంతబొమ్మాళి, జూలై 12(వార్త):** ఆర్థిక భారం ఉన్నా... ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని, అనుభవం ఉన్న నేత ముఖ్యమంత్రిగా ఉన్నందున ప్రజలకు సమాంతర అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులను ప్రారంభించిన మంత్రి... ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి వడ్డితాండ్ర బీటీ రోడ్డుకు రూ.125లక్షలతో, పొందాల తుంబయ్య ఇంటి నుంచి స్మశానవాటిక వరకు రూ.54.60 లక్షలతో నిర్మించనున్న రహదారులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ నెలలో రైతులకు పెట్టుబడి సాయం అందించనున్నట్లు వెల్లడించారు. రూ.84 కోట్లతో వడ్డితాండ్ర నుంచి రావివలస రహదారి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. కొత్తపేట నుంచి పాలేసమ్మ గుడి వరకు విశాలవంతమైన రహదారి పూర్తికానుందని త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,700 టీచర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని, ఫలితాలు వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల నియామకాలు జరుపుతామని వెల్లడించారు. నియోజక వర్గంలో రూ.600 కోట్లు జలజీవన్ మిషన్ కింద మంజూరుచేసి ప్రతీ ఇంటికి శుద్ధ జలాలు అందించనున్నామని వివరించారు. తల్లికి వందనం పథకం కింద 8,800 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఏడాదికి నాలుగువేల కోట్ల రూపాయల ఆర్థిక భారం అయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందుకు లేకుండా సకాలంలో ఖరీఫ్ సీజన్లో శివారు ప్రాంతాలకు సాగునీరందించే విధంగా సాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2 కోట్ల 85 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక భారం ఉన్నప్పటికీ అనుభవం ఉన్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నందున ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మిస్టర్ ఆంధ్రబాడీ బిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

- ప్రతీ బాడీబిల్డర్ పతకాలతో మెరవాలి
- ప్రముఖ వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావు

**శ్రీకాకుళం, జూలై 12 (వార్త):** కడపలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ఈనెల 13వ తేదీన జరగనున్నాయని, ఈ పోటీలకు మన శ్రీకాకుళం జిల్లా నుంచి పలువురు ఎంపికైనట్లు శ్రీకాకుళం స్టార్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్ తెలిపారు. ఎంపికైన వారిలో అవినాష్ 60 కేజీలు, శివ 65, బ్రహ్మం75, వైకుంతం 55, ప్రేమ్ కుమార్ 55, కోటేశ్వరరావు 60, రాకేష్ 65, రాజు90, దిలీప్ 50 కేజీల విభాగంలో తలపడనున్నారన్నారు. ఎస్-ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లాకు కీర్తిని తీసుకురావాలని, ప్రత్యేకంగా బాడీ బిల్డర్స్‌కు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ది ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.గౌరీ శంకర్, పవర్ హౌస్ జిమ్ అధినేత రాజు, శ్రీకాకుళం సీనియర్ బాడీబిల్డర్ దుమ్ము అప్పన్న, పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల పంపిణీకి..
# అర్హుల జాబితా సిద్ధం చేయండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి/టెక్కలి, జూలై 12(వార్త):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టే క్రమంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయడం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నందిగాం, టెక్కలి, పలాస మండలాల రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అర్హులైన లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, స్థలాల లే అవుట్లను పరిశీలించాలి. పట్టాల పంపిణీ కోసం తగిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఆదేశించారు. నందిగాం మండల పరిధిలో ఇప్పటివరకు 1453 లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరవగా, అందులో 236 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారని, 1021 స్థలాలు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని అధికారులు వివరించారు. దీనిపై మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, మిగిలిన లబ్ధిదారులకు త్వరగా అవసరమైన సహాయం అందించి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.కృష్ణమూర్తి, వెంకటేశ్ లకు మంత్రి ప్రత్యేకంగా సూచనలు చేశారు. త్వరితగతిన అర్హుల జాబితా సిద్ధం చేసి పంపిణీకి ముస్తాబుగా ఉంచాలని కోరారు. ఇళ్ల స్థలాల లే అవుట్లను స్వయంగా అధికారులే వెళ్లి పరిశీలించాలి. దాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో ఆర్డీవోలు కృష్ణమూర్తి, వెంకటేశ్, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాల పునరుద్ధరణకి మంత్రి అచ్చెన్నాయుడు చొరవ

ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ముందు చర్యలు చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి మండల కేంద్రంలో గతంలో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పునరుద్ధరణకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. శనివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.టి.గోవిందమ్మ, కె.సూర్యప్రసాద్ రావులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు తోడ్పడే కోర్సులపై ప్రతిపాదనలు రూపొందించి, విశ్వవిద్యాలయ ప్రాథమిక ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కమిటీ సభ్యులకు సూచించారు. అలాగే కళాశాల కోసం అవసరమైన భవన సముదాయం, విశాలమైన స్థలం, ఇతర మౌలిక సదుపాయాలను ప్రతిపాదనల్లో పొందుపరచాలని పేర్కొన్నారు. త్వరితగతిన తరగతులు ప్రారంభమయ్యేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

### ప్రజల నుంచి వినతుల స్వీకరణ

అనంతరం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గతంలో మంజూరైన ఇండ్లకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదని పలువురు బాధితులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గత ప్రభుత్వ కాలంలో పింఛన్లు నిలిపివేయడం వల్ల అర్హులైన వారికి ఇబ్బందులు తలెత్తాయని ప్రజలు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి... త్వరలో వాటి పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పేద కుటుంబానికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం



**మందస, జులై 12(వార్త):** మందస మండలంలోని నర్సింగపురం పంచాయతీ మహాదేవపురం గ్రామానికి చెందిన మూలి సింహాచలం అనే యువకుడు ఇటీవల కంచిలి మండలంలోని శ్రీరామపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఓ చేయి కోల్పోయాడు. కంచిలి మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుని, అత్తవారి ఇంటి దగ్గరే సింహాచలం ఉంటున్నాడు. ఇక్కడ తల్లితండ్రులకు ఇల్లు, ఎటువంటి ఆదాయం లేక పోగా, అక్కడ అత్తవారికి కూడా ఎటువంటి ఆదాయం లేకపోవడంతో పాటు నిరు పేదరిక కుటంబం కావడంతో దాతలు సహాయాన్ని సిక్కోలు ఉద్దానం సేవా సమితి కోరగా.. వారు స్పందించారు. సహాయం అందించే లోపు సింహాచలం మరణించాడు. సిక్కోలు ఉద్దానం సేవాసమితి ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం మృతుని తల్లిదండ్రులు మూలి సరస్వతి, పీతాంబరంలకు అందజేశారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు మిన్ను, మని, విషు, గ్రామస్తులు పాల్గొన్నారు. స్వచ్చంధ సేవా సంస్థలు కూడా ఈ కుటంబాన్ని మీకు తోచిన సహాయం అందించాలని వారు కోరారు.

## అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు



**పలాస, జులై 12(వార్త):** నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా లేఅవుట్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ పుర పాలక సంఘంలో రోజువారి శానిటేషన్ పర్యటన విధులలో భాగంగా శనివారం మండల పరిషత్ ఆఫీస్ రోడ్డు, కే టి రోడ్డు జంక్షన్, 21వ వార్డు గాంధీ నగర్, ఓల్డ్ బస్టాండ్, పద్మనాభ పురం కాలనీ, తాళ్లభద్ర తదితర ఏరియాలలో పర్యటించి శానిటేషన్ మెరుగుపరుచుటకు శానిటేషన్ సిబ్బందికి, శానిటేషన్ అధికారులకు పలు సూచనలు అందజేశారు. 21వ వార్డు గాంధీనగర్లో బాబు కార్డుతో కాలువలలో సిల్ట్ తీయించడం, కాలువల పక్కన జంగిల్ క్లియరెన్స్ చేయించారు. పద్మనాభ పురం కాలనీ తాళ్లబద్ర తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లబద్ర ఉప్పరపేట ఏరియాలలో అక్రమంగా లేఔట్ లో వేస్తున్న విషయాన్ని గుర్తించి సంబంధిత టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఈ లేఔట్ల విషయమై పూర్తి వివరములు సేకరించి తగు చర్యలు తీసుకొనుటకు గాను ఆదేశములను ఇవ్వడం జరిగింది. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్లో గల అన్న క్యాంటీన్ తనిఖీలు లలో భాగంగా నేడు కూడా బ్రేక్ ఫాస్ట్ టైం లో ఇన్స్పెక్ట్ చేయటం జరిగింది. నిర్వహణ సంతృప్తికరముగా ఉన్నదని కమిషనర్ వెల్లడించారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉదయ్, శ్రీనివాసరావు, భాస్కరరావు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

## నారాయణపురంలో సుపరిపాలన



**మందస, జులై 12(వార్త):** మందస మండలంలోని నారాయణపురంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా సుపరిపాలన కార్యక్రమం నిర్వహించింది. పెద్దకేశుపురం, చిన్నకేశుపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం జరిగింది. గత ఏడాదిగా చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల గురించి స్థానిక ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకుని, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బమ్మిడి కర్రయ్య, ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, తమిరి భాస్కరరావు, క్లస్టర్ కన్వీనర్ ముంజేటి చంద్రశేఖర్, మంగళ పాత్రో, బొంగి దామోదర్, మల్లేన జనార్దన్, రెయ్యి రాజు, శివంగి మురళి, దమయంతి, ధర్మారావు, యూనిట్, బూత్, కేఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మందసలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**మందస, జూలై 12(వార్త):**మందస పట్టణంలో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ లోని పలు దుకాణాలలో పోలీస్ జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, క్రయ విక్రయాలు, రవాణా అరికట్టే చర్యలలో భాగంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ ను అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## బుద్ధుని విగ్రహాలను దర్శించిన డిప్యూటీ రిజిస్ట్రార్

**మందస, జూలై 12(వార్త):** పాలవలస(సోంపేట మండలం) మెట్టపై గల గౌతమ బుద్ధుని విగ్రహాలను అనకాపల్లి కోపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.జ్యోతిశ్వరరావు సందర్శించారు. ఆయనతో పాటు రిటైర్డ్ అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రట్టి మాధవరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ బౌద్ధ క్షేత్రాన్ని అభివృద్ధి చేయుటకై ముందుకు రావాలని అన్నారు, అభివృద్ధికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గౌతమ్ బుద్ధ ట్రస్ట్ సెక్రెటరీ కె.ఉమాపతి, ఎంఎన్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గీతా రాణి, కలంగలం క్రియేషన్స్ నగిరి కరుణాకర్, మార్పు వెంకటరమణ, శ్రీని వాసరావు, పిట్ట జోగారావు, బి. దుర్యోధన, జి.భీమారావు, సిహెచ్ పద్మలోచన తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**మందస, జూలై 12(వార్త):** మండల మహిళా సమాఖ్య పరిధిలోగల కుసుమల గ్రామ సంఘం వార్షిక మహాజన సభ జరిగింది. నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులతో క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామినాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం 1995 చట్టం ప్రకారం ప్రతి ఏడాది కూడా గ్రామ సంఘం లెక్కలను చార్టెడ్ అకౌంటెంట్ వారితో ఆడిట్ చేయించుకుని, గ్రామ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, గ్రామ సంఘం కొత్త పాలకవర్గంతో పాటు, నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక జరగవలసి ఉన్నందున షెడ్యూల్ ప్రకారం మండలంలో గల అన్ని గ్రామ సంఘాలలో కూడా మహాజనసభలు జరుగుతున్నట్లు వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. కుసుమల పంచాయతీ పరిధిలో గల గ్రామ సంఘం కొత్త కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షురాలుగా పద్మావతి, కార్యదర్శిగా మేరీ, కోశాధికారిగా రేవతి, ఉపాధ్యక్షురాలుగా కళ్యాణి, ఉప కార్యదర్శిగా నీలమ్మ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.వో.ఏ.లు జగబంధు, ఆనందు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు న్యాయపరమైన సహకారం అందిస్తాం

### జనసేన పార్టీ నాయకులు బాలరాజు

**మెళియపుట్టి, జూలై 12 (వార్త):** ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్వాసితులకు జనసేన పార్టీ తరఫున న్యాయపరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు, సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, భవానీలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు తెలిపారు. సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి భవానీల నేతృత్వంలో మెలియాపుట్టి మండలం, చీపురుపల్లి గ్రామంలో శ్రీకాకుళం లీగల్ టీం సభ్యులు వడ్డేపల్లి జ్యోతిర్మయి, గొంటి చంద్రమోహన్, అంకడాల వేణుగోపాలరావులు శనివారం గ్రామస్తులతో సమావేశమై నిర్వాసితులు న్యాయపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లీగల్ టీం సభ్యులు మాట్లాడుతూ ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన ప్రతి సమస్యను సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, భవానీల ద్వారా తాము సేవలందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యావ్వరి ఈశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు బాలరాజు, తిరునగరి ప్రసాద్, దొర విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నందిగామ సింహాద్రి, సిగిలివలస వీరస్వామి, సిరియాల బెనర్జీతోపాటు యువకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో..
# మత్స్యకారులకు బలమైన భరోసా

- ఎమ్మెల్యే గొండు శంకర్
- సబ్సిడీపై మత్స్య పరికరాలు పంపిణీ



**శ్రీకాకుళం, జూలై 12(వార్త):** మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బందరువానిపేట గ్రామానికి చెందిన 52 మంది మత్సకారులకు రూ.67,85,100 విలువైన నెట్‌లు, ఇంజన్లు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీ ఎం ఎం ఎస్ వై) కింద 40 శాతం సబ్సిడీతో పాటు జిల్లా పరిపాలన ద్వారా అదనంగా మరో 10 శాతం సబ్సిడీ కల్పించి మొత్తం 50 శాతం సబ్సిడీతో ఈ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తోంది. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి అహర్నిశలు ప్రజల కోసం శ్రమిస్తున్నారు. నేడు మత్స్యకారుల ముఖాల్లో చిరునవ్వు చూడటం నా రాజకీయ జీవితంలో చిరస్మరణీయ ఘట్టం అని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ రమణయ్య, టీడీపీ నాయకులు, రూరల్ టీడీపీ ప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

### బాడ్మింటన్ క్రీడతో మానసిక దృఢత్వం

బాడ్మింటన్ క్రీడా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందే కాకుండా, మనలో ఆత్మవిశ్వాసం, దృఢతను పెంపొందిస్తుందని, క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందడం సాధ్యమేనని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలను శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా క్రీడలకు కేంద్రమవుతోందన్నారు. బాడ్మింటన్ క్రీడలోనూ ప్రతిభావంతులెందరో ఉన్నారన్నారు. ఒలింపిక్ పతక విజేత కరణం మల్లేశ్వరి అందించిన కీర్తి ప్రతీ క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రతి యువ క్రీడాకారుడు జిల్లా పేరు గర్వించదగినదిగా చేస్తూ, దేశం, ప్రపంచానికి మన ప్రతిభను చాటాలన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రతి క్రీడాకారుడు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల మద్దతు, ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళాన్ని ఒక ప్రముఖ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ శిర రమణయ్య, బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష బృందం, క్రీడాకారులు, తల్లిదండ్రులు, స్థానికులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సుపరిపాలనకు తొలిఅడుగుకు అపూర్వ స్పందన

జిల్లాలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోంది. ఎమ్మెల్యేలు గడపగడపకు వెళుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలకు కరపత్రాల ద్వారా పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని 11వ డివిజన్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చే ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. నియోజక వర్గం ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఎం.వెంకటేష్, సీర వెంకటరమణ, 11వ డివిజన్ ఇంచార్జి జోగా నూకరాజు యాదవ్. పి.ఈశ్వరరావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:**నరసన్నపేట పట్టణంలో 11వ వార్డ్ పరిధిలో లచ్చుమన్నపేట 1,2 వీధుల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం, సంవత్సర కాలంలో చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ యువ నాయకురాలు, సమన్వయ కర్త బగ్గు అర్చన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, పట్టణ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు.



# ఎరువుల కొరత లేదు



- ప్రతీ రైతు కావలసిన ఎరువులు తీసుకోవచ్చు
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ధరల నియంత్రణకు బృందాలు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జూలై12 (వార్త):** జిల్లాలో ఎరువుల కొరత లేదని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం ఒక ప్రకటన విడు దల చేశారు. ప్రతీ రైతు తమకు కావలసిన ఎరువులు తీసు కోవచ్చన్నారు. ఎరువులకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు కావలసిన ఎరువులు ప్రభుత్వం 50 శాతం, ప్రైవేటు వర్తకులు 50 శాతం సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు అందజేయడం జరుగు తుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో యూరియా 10583 ఎంటీఎస్, డి.ఏ.పి 6402 ఎంటీఎస్, పొటాష్ 922 ఎంటీఎస్, కాంప్లెక్స్ 3084 ఎంటీఎస్, సూపర్ పాస్ఫేట్ 842 ఎంటీఎస్ సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇందులో రైతు సేవా కేంద్రాలకు 50 శాతం పంపిణీ చేయడమైనదని వివరిం చారు. ప్రస్తుతం ఈ నెల 11 నాటికి ఏపీ మార్కెఫెడ్ వద్ద ఉన్న నిల్వలు యూరియా 5692.365 ఎంటీఎస్, డి.ఏ.సి 215.0 ఎంటీఎస్, 5292.0 ఎంటీఎస్ అందుబాటులో ఉంద న్నారు. ఇప్పటి వరకు ఈ నెల 5 నాటికి జి.సిగడం మండ లంలో యూరియా 314.595 ఎంటీఎస్, డి.ఏ.పి 302.25 ఎంటీఎస్, పొటాష్ 25.0 ఎంటీఎస్, 129.25 ఎంటీఎస్, 17.0 ఎంటీఎస్, 2,788.095 ఎంటీఎస్, సరఫరా అయి నట్లు వివరించారు. జూలై 5 నాటికి జి. సిగడం మండలంలోని రైతు సేవ కేంద్రాలు ద్వారా ఇప్పటి వరకు యూరియా 239 ఎంటీఎస్, డి.ఏ.పి 80.0 ఎంటీఎస్, మండల వ్యవసాయ అధికారి ప్రతిపాదనలు మేరకు మొత్తం 319.76 ఎంటీఎస్, సరఫరా చేయడమైనదని, ఇంకా ఈ వారంలో యూరియా 140.0 ఎంటీఎస్, సరఫరా చేయడానికి మార్కెఫెడ్ ద్వారా ప్రతిపాదనలు చేయడమైనదని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఏప్రిల్ 1 నాటికి ప్రారంభ నిల్వ సుమారు 15129 ఎంటీఎస్, జూలై 10 నాటికి సరఫరా అయ్యాయన్నారు. 21835 ఎంటీఎస్, అమ్మకాలు చేశామన్నారు. 7583 ఎంటీఎస్,. ప్రస్తుతం అందు బాటులో ఉన్న ఎరువులు 29382 ఎంటీఎస్, (రిటైలర్ మరియు హోల్ సేల్) ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఎరువుల అధిక ధరలు నియంత్రణకు అంతర్గత బృందాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకున్నామన్నారు. ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని ఆదేశించామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## వాసుదేవుని దర్శించుకున్న తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ

**మందస, జులై12(వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయాన్ని తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ నరసింహన్ వెంకటేష్ దర్శించుకున్నారు. ఆయనకు మందస తహశీల్దార్ మిస్క శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం వాసుదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ నరసింహన్ వెంకటేష్ ను అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, ఎంఆర్ఐ ఎస్.చిన్నారావు ఉన్నారు.

### కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో..

# ఉద్దానంలో విధ్వంసం

*** పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలి * ఉద్దానంలో ప్రజాసంఘాల చైతన్యయాత్ర**

**మందస, జులై 12(వార్త):** కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో బలవంతంగా భూసేకరణ ఎందుకు చేస్తున్నారని, పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వామపక్ష నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహన్ రావు, లిబరేషన్ పార్టీ నాయకులు మద్దిల రామారావు డిమాండ్ చేశారు. బలవంతం భూసేకరణ ఆపాలని కోరుతూ మందస మండలంలోని రాంపురం, బిడిమి గ్రామాల్లో చైతన్యయాత్రలను కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేకపోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రెవెన్యూ యంత్రాంగాన్ని, పోలీసు యంత్రాంగాన్ని రైతాంగంపై భూముల కోసం ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ఢిల్లీ, బెంగుళూరు, బొంబాయి, విశాఖపట్నం తదితర అన్ని నగరాల్లో ఎయిర్పోర్ట్‌కు అనుబంధంగా కార్గో




ఎయిర్పోర్ట్ ఉందని, దేశంలో ఎక్కడా కూడా ప్రత్యేకంగా కార్గో ఎయిర్పోర్ట్ లేదన్నారు. ఉద్దానంలో ఎందుకు కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో భూములు గుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారో మౌనం వీడి ప్రజలకు రామ్మోహన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోనే అతి పెద్దదైన ఢిల్లీ ఎయిర్ పోర్ట్ కి అనుబంధంగా ఉన్న కార్గో ఎయిర్పోర్టు 150 ఎకరాల్లో మాత్రమే ఉన్నదని గుర్తు చేశారు. జాతీయ అవార్డులు అందుకుంటున్న పలాస జీడిని కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో విధ్వంసం ఎందుకు సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లను నరకడం వల్ల పర్యావరణ పరంగా శ్రీకాకుళం జిల్లాకు తీరని ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భూములు బలవంతంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, లక్షలాది చెట్లు నరకడం.. మీరు చేస్తున్న అభివృద్ధా లేదా విధ్వంసమా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కార్గో ఎయిర్పోర్ట్ పేర్లతో ప్రజల భూములు కార్పొరేట్లకు ఎందుకు కట్టబెడుతున్నారో చెప్పాలన్నారు. బలవంత భూ సేకరణ వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్పోర్ట్ పోరాట కమిటీ నాయకులు పి.కుసుమ, కె.రమేష్, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తేప్పల అజయ్ కుమార్, సిఐటియు నాయకులు యన్.గణపతి, జోగి.కోదండ, పత్రీ దానేష్, జె .భూపతి, డి.హరికృష్ణ, నీలకంఠం, కొర్ల హేమారావుచౌదరి, ఎం.సంతోష్, నల్ల హడ్డి, వెంకట్రావు, చిత్త గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## పట్టుదలతో చదివి..

# కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి..

**రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించిన శానాపతి భవాని**



**మందస, జులై 12(వార్త):**పట్టుదల, కృషి, అంకితభావం ఆమెను కానిస్టేబుల్‌ను చేశాయి. వివాహం అయ్యాక కూడా తాను ఉద్యోగం సాధించాలన్న తపనతో ఏకంగా రాష్ట్ర స్తాయిలో రెండో ర్యాంక్ సాధించిన ఆమె అందరి అభినందనలు అందుకుంటున్నారు. మందస మండలంలోని పిడి మందస గ్రామానికి చెందిన సేనాపతి భవాని పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలను రాశారు. ఈ పరీక్షల్లో తన సత్తా చాటి అందరి దృష్టి ఆకర్షించింది. ఇటీవల విడుదలైన 2025 ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉమెన్ కేటగిరిలో 154 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని ప్రతిభ చాటింది. భవానీ తల్లిదండ్రులు భారతి, శ్యామలరావులు కూలి పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. గిరిబాబుకిచ్చి వివాహం జరిపించారు. భర్త గిరిబాబు డీఎస్సీకు ప్రిపేర్ అవుతున్నాడు. భర్త ప్రోత్సాహంతో, దృఢ సంకల్పంతో రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి పోలీస్ కొలువును సాధించింది భవాని. ఒక పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని క్రమ శిక్షణతో ప్రణాళిక బద్ధతతో కష్టపడి చదివి విజయం సాధించి తన కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన భవానీను పలువురు అభినందించారు.

# సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

*** ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత * ఇద్దరిపై కేసు నమోదు, లారీ, బియ్యం సీజ్**



**కొత్తూరు, జులై 12 (వార్త):** కొత్తూరు మండలంలోని కడుమ గ్రామం నుంచి ఒడిశాలోని నవరంగపూర్‌కు వెళ్తున్న లారీని శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కొనవలస చెక్‌పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. లారీలో 34,800 కిలోల బరువుతో కూడిన 700 బస్తాల పిడిఎస్ బియ్యం ఉండడంతో అధికారులు ఆ బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. ఈ బియ్యానికి అంచనా విలువ రూ.15,83,400 ఉంటుందని ప్రాథమిక విచారణకు వచ్చారు. ఈ బియ్యం కొత్తూరు మండలానికి చెందిన రైస్ మిల్ యజమాని గోవిందరావు ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. డ్రైవర్ మానేపల్లి వెంకటేష్‌ను విచారణ చేయగా ఈ బియ్యం స్థానిక తెల్ల రేషన్ కార్డు లబ్దిదారుల నుండి సేకరించి, వాణిజ్య ప్రయోజనాల కోసం ఒడిశాలో అమ్మకానికి తరలిస్తున్నట్టు వెల్లడైంది. విజిలెన్స్ అధికారులు లారీతో పాటు మొత్తం బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ అధికారులకు అప్పగించారు. ఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం, 1955 నిబంధనల ప్రకారం 6(ఎ), 7(1) సెక్షన్ల కింద గోవిందరావు, లారీ డ్రైవర్ వెంకటేష్‌లపై కేసులు నమోదు చేశారు. వారిపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ కి చెందిన ఇన్‌స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కానిస్టేబుళ్లు పురుషోత్తమ, తిరుపతిరావు, రెవెన్యూ శాఖ అధికారి హేమలత పాల్గొన్నారు.

# గడపగడపకూ బీజేపీ నాయకులు

**పాతపట్నం, జులై 12 (వార్త):** పాతపట్నం మండలం సీతారాంపల్లి గ్రామంలో ప్రధాని నరేంద్రమోడీ 11సంవత్సరాల సుపరిపాలన, పేదల సంక్షేమం, అభివృద్ధిపై బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఏపీకి పెద్దఎత్తున నిధులు మంజూరవుతున్నాయన్నారు. అలాగే ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో పాతపట్నం బీజేపీ మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు, మండల ప్రధానకార్యదర్శి బడియాల బాబురావు, దారపు గోవింద, పైల భాస్కరరావు, రిటైర్డ్ ఎంఈవో శ్రీధర్, దుర్గాప్రసాద్, సీతారాం పల్లి సర్పంచ్ ధర్మాన కుమార్ రెడ్డి, ధర్మాన అప్పలరెడ్డి, ఉప్పాడ దాసురెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు సిరిపురం పరామర్శ

**కొత్తూరు, జులై 12 (వార్త):** కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మొజ్జాడా చక్రపాణి ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శనివారం చక్రపాణి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా, ఆకుల తంపర గ్రామానికి చెందిన పసల రామారావు మరణించిన వార్త తెలుసుకుని వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయా కార్యక్రమాలలో కొత్తూరు మండల బీజేపీ అధ్యక్షులు బురాడ భాస్కరరావు, కాపల దమయంతి, చల్లా ఈశ్వర్, గోపాలకృష్ణ, కుమారస్వామి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్మార్ట్ మీటర్లను బిగించొద్దు

**కొత్తూరు, జులై 12 (నేడు న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళుకి విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించడం ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తూరు మండలం గొట్టిల్లపిల్లి పంచాయతీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి నేడు రెట్టింపు చేస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, పి.రమేష్, మోహన్, జమ్మయ్య, రమణ పాల్గొన్నారు.

## ఒండ్రుజోలలో టీడీపీ నేతల... సుపరిపాలనలో తొలి అడుగు

**కొత్తూరు, జులై 12 (వార్త):** టీడీపీ కొత్తూరు మండల అధ్యక్షుడు అగతముడి మాధవరావు ఆధ్వర్యంలో ఒండ్రుజోల గ్రామ పంచాయతీ పరిధిలోని బూత్ నెం 262లో డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను శనివారం నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకూ వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తల్లికి వందనం పథకం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం,అన్న క్యాంటీన్లు ద్వారా నాణ్యమైన భోజనం, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు అగతముడి మాధవరావుతో పాటు అగతముడి అరుణ్ కుమార్, మాతల గాంధీ, మండల ప్రధాన కార్యదర్శి అరబోలు దశరథ, క్లస్టర్ కో ఇన్చార్జ్ వాలిపల్లి వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముగితి కృష్ణారావు, రాజు కుమారి, వంగరవెల్లి శ్రీనివాసరావు, యార్లంకి తిరుపతిరావు, డొక్కా ఆనందరావు, బామిడి సుందర్ నారాయణ, జంక శంకర్రావు, చోడవరపు రాము, పిన్నింటి మన్మధరావు, రేగిన తిరుపతిరావు, నిమ్మగడ్డ తేజ, శ్యామ్, అమ్మన్న, గురివినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546